# పాతకథే

రేఖా, రమేశ్ ప్రేమించుకున్నారు.

ఇద్దరూ అందమైన వాళ్ళు పేర్లుకూడా ఎంతో అందంగా వున్నాయ్. ఒకే కాలేజీలో, ఒకే క్లాసు చదువుకొంటున్నారు.

"మరి ప్రేమించుకోక పోతే ఏం చేస్తారు? నువ్వు కొత్తగా చెప్పేది ఏమిటి బోడి!" అంటున్నారుగదూ?

నేను కొత్తగా ఏం చెప్పడం లేదు. పాతకథే చెబుతున్నాను. అవును! ఒప్పుకుంటాను - "ప్రేమ" ఈ పదం అరిగిపోయి తుప్పు పట్టిన రికార్డులోని మాటేనని!

నేను కొత్త విషయం చెప్పడం లేదు. పాతకథే చెబుతున్నాను.

ఎందుకు మళ్ళీ పాతకథే చెప్పడం అంటున్నారా?

ప్రేమ కథను ఎన్ని సార్లు చెప్పినా మీరు కొత్తగానే వింటారుగా? అందుకే చెబుతున్నాను.

చెప్పిందే చెప్పినా ప్రేమ కథలయితే అవురావుమంటూ చదువుతారు కనకనే చెబుతున్నాను.

"యుగయుగాలుగా పూలు వికసిస్తూనే వున్నాయ్. గులాబి పువ్వుల్ని నిత్యం చూస్తూనే వుంటాం. అయినా మన వాకిట్లో పూచిన గులాబి పువ్వును ఎన్నడూ గులాబిని చూడనట్టే ఆసక్తిగా, ఆనందంగా చూస్తాం. గాలి కూడా ఆ పువ్వును ఉపేక్షించదు. దాని సుగంధాన్ని దశదిశలా వ్యాపింప చేస్తుంది. అలాగే పాత మాటలు కొత్త భావాన్ని వ్యక్తం చేసినప్పుడు కొత్తగా విన్పిస్తాయి."

"ప్రేమ అనే శబ్దం పాతదే కావచ్చు. కాని ఆ శబ్దాన్ని పలికే ప్రతివ్యక్తి పెదవుల మీద. కొత్తదనాన్ని పుణికి పుచ్చుకుంటుంది. ప్రతివ్యక్తి హృదయంలో కొత్త కొత్త అనుభూతుల్ని కలిగిస్తుంది, అందుకే ప్రేమనిత్య నూతనం అయింది" అని నేను అనడం లేదు.

ప్రేమ కథలు వినేవారూ, చెప్పేవారూ అంటూ వుంటారు. అందుకే పాత కథనే కొత్తగా చెప్పాలను కున్నాను.

పాత ప్రేమ కథే రేఖా రమేశ్‌ల మధ్య కొత్తగా ప్రారంభం అయింది.

రేఖ చక్కగా అలంకరించుకొని కాలేజీకి వస్తుంది.

"బాపూ" వేసిన ముఖ చిత్రంతో వెలువడిన దీపావళి స్పెషల్ మాస పత్రికలా ఆమె కాలేజీ విద్యార్థుల్ని ఆకర్షిస్తుంది.

ఆమె నడక చూస్తుంటే, రాచకొండ కథ చదువు

తున్నట్టు విద్యార్థులకు అద్భుతమైన అనుభూతి (థ్రిల్లింగ్) కలుగుతుంది.

ఆమె కళ్ళల్లో కలలు కదిలి పోతూ వుంటాయి.

ఆమె మనసు నిండా మధువు వుంది.

ఆ మధువుని ఎవరి దోసిట్లోనైనా పొయ్యాలనే ఆరాటం వుంది. ఆమె హృదయంలో.

ఆమె నవ్వితే ఇంద్ర ధనస్సులు విరిగి పడ్తాయి.

ఆమె మాట్లాడుతూ వుంటే ఉర్దూ కవిత్వం వింటున్నట్టు వుంటుంది.

కాలేజీ మాగజైన్‌లో ఓ కుర్రాడు ప్రేమ కథ రాశాడు. ఆ కథలో హీరోయిన్ "రేఖే" అన్నారు అందరూ.

మరో కుర్రాడు ప్రేమ కవిత్వం రాశాడు.

అదీ ఆమెను గురించే అన్నారు అందరూ.

ఆమెలో హేమమాలిని పోలికలున్నాయని కొందరంటే కాదు వాణిశ్రీ పోలికలు వున్నాయన్నారు మరి కొందరు విద్యార్థులు.

అందాల రాశి రేఖ కోసం ఎందరో విద్యార్థులు తమ హృదయాలను పారేసుకున్నారు. ఇందులో ఆశ్చర్యపడాల్సింది ఏమీ లేదు.

హృదయాలు పారేసుకున్న వాళ్ళలో రమేశ్ కూడా వున్నాడు.

అందరూ "రమేశ్ అదృష్టవంతుడు" అన్నారు.

నిజమే! రమేశ్ అదృష్టవంతుడే. అందుకే అతని హృదయం కిందపడి ముక్కలై పోకుండా, అపురూపంగా అంది పుచ్చుకుంది రేఖ.

ఇంకేం ? సరి కొత్త ప్రేమ కథ మొదలైంది.

రెండు కళ్లు నాలుగైనాయి (చార్ ఆంఖేంహుయీఁ)

చూపులు ఊసులు చెప్పుకున్నాయి.

చిరునవ్వులు పలకరించేసుకున్నాయి.

పుస్తకాలు మార్పిడి జరిగింది.

ఆ పుస్తకాలు ఒకరి ప్రేమ లేఖల్ని మరొకరికి రెండో కంటికి తెలియకుండా, గుప్తంగా, భద్రంగా అందించాయి.

మనసులు మార్గాన్ని అన్వేషించాయి.

అభిలాషలు ఆ మార్గంలో పూలు చల్లాయి. కాని ఆ పూల మధ్య లోకం అమర్చిన ముళ్ళు వాళ్ళ కళ్ళకు కన్పించలేదు.

ప్రేమ కథ ఆ పూల బాటలో వయ్యారంగా నడక సాగించింది.

సినిమాలూ - షికార్లూ, ప్రేమ సంభాషణలూ - కథ వేగాన్ని పుంజుకుంది, ఊపుగా ముందుకు పోతూంది.

కొత్త శైలిలో పాత కథ కొంత దూరం మాత్రమే ఉత్సాహంగా నడిచింది.

అంతవరకూ, తారు రోడ్డు మీద, సరికొత్త ఇంపాలా కారులా నడిచిన కథ, గతుకుల బాటలో ఒకఎద్దు బండిలా నడవ సాగింది.

కొంత వరకూ, అన్ని ప్రేమ కథలూ ఒకటిగానే వుంటాయి. ఆ కథల ముగింపులే వేరు వేరుగా వుంటాయ్.

రేఖ కూడా కథ ముగింపును గురించి ఆలోచనలో పడింది.

దాంతో కథ ముందుకు కదలనని మొరాయించింది.

ఒక రోజు రేఖ రమేశ్‌ను అడిగేసింది — "ఎంత కాలం ఇలా?"

రమేశ్ రేఖ ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఏమిటి అలా చూస్తావ్? మన పెళ్ళి విషయం మీ నాన్నతో చెప్పావా?" అడిగింది రేఖ.

రమేశ్ ఆలోచనలో పడ్డాడు.

"ఏమిటి మాట్లాడవే?" రెట్టించింది రేఖ.

"మానాన్న అంటే నాకు భయం!"

రేఖ భయంభయంగా చూసింది.

"రోజూ అడగా లనుకుంటూనే అడగలేక పోతున్నాను."

"మరి ఎలా" బేలగా చూసింది రేఖ.

రమేశ్ ఓ క్షణం ఆలోచించాడు. రేఖ ఆత్రుతతో అతని ముఖంలోకి చూస్తోంది.

"మీ నాన్నను వచ్చి మా నాన్నతో మాట్లాడమను." అన్నాడు రమేశ్.

"నాకు సిగ్గు బాబూ! మా నాన్నతో ఎలా చెప్పడం?" బోలెడంత సిగ్గు ముంచేసింది రేఖను.

"మీ అమ్మతో చెప్పు. ఆమె మీ నాన్నతో చెబు. తుంది."

రేఖకు రమేశ్ సలహా బాగానే వున్నట్టు అనిపించింది.

* * *

ఆ రాత్రి రేఖ తల్లితో చెప్పింది.

అంత గొప్పింటి పిల్లవాడు కూతుర్ని ప్రేమిస్తున్నట్టు విని ఆ తల్లి ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయి పోయింది. తన బిడ్డ అదృష్ట వంతురాలు! అనుకొని మురిసి పోయింది

మురిపెంగా కూతురి తల నిమిరింది. కూతురు తల్లి గుండెల్లో తన మొహం దాచుకుంది.

భోజనాల దగ్గిర రేఖ తల్లి, తండ్రితో చెప్పేసింది.

తెల్ల వారే వెళ్లి రమేష్ తండ్రితో మాట్లాడమని చెప్పింది మళ్లీ ఆలస్యం ఎందుకు అన్నట్టు.

రేఖ తండ్రి కళ్లు పెద్దవి చేసుకొని తల్లీకూతుళ్ళను మార్చి మార్చి చూశాడు.

నోటి దగ్గిరకు వెళ్ళబోతున్న చెయ్యి మధ్యలోనే ఆగి పోయింది.

"ఏమిటి అలా చూస్తారు?" రేఖ తల్లి రామ సుబ్బమ్మ అన్నది.

గోపాలరావు కొడుకు తన కూతుర్ని ప్రేమిస్తున్నాడా? తను అకౌంటెంటుగా పనిచేసే కంపెనీ మానేజింగ్ డైరెక్టర్ కొడుకు తన కూతుర్ని పెళ్ళి చేసుకుంటానన్నాడా? తను వెళ్ళి "నీ కొడుకూ నా కూతురూ ప్రేమించుకుంటున్నారు. ఇంకా ఆలస్యం ఎందుకూ? ముహూర్తాలు పెట్టిద్దాం!" అని చెప్పాలా ?

శేషయ్యకు దాదాపు మతి పోయినట్లే అయింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" భార్య అడిగింది.

"మీ ఇద్దరికీ పిచ్చి పట్టిందా?" ఇద్దర్నీ పిచ్చివాడిలా చూస్తూ అన్నాడు శేషయ్య.

రేఖ చిప్పున తలెత్తి తండ్రి మొహంలోకి చూసింది.

"అదేమిటండీ అలా అంటారు? ఆ అబ్బాయి మన అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. అమ్మాయిని తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకోనంటున్నాడట."

"ఎవరితో అంటున్నాడట!" వెక్కిరింపుగా అన్నాడు.

"ఇంకెవరితో మనమ్మాయి తోటే."

"అమ్మాయితో అంటే ఏం లాభం? ఆ మాటే వాళ్ళ నాన్నతో అనవచ్చుగా?"

"వాళ్ళ నాన్న అంటే రమేష్‌కు భయం. నిన్ను అడగమని చెప్పమన్నారు." తలవంచుకొని అన్నది రేఖ.

తండ్రి ఓ క్షణం కూతురి ముఖంలోకి చూశాడు.

"మన అంతస్థేమిటి? వాళ్ళ అంతస్థేమిటి? నేను మాత్రం ఎలా అడగ్గలను"

"ప్రేమకు అంతస్థులు తెలియవు నాన్నా" చివ్వున తలెత్తి తీవ్రకంఠంతో సినిమా డైలాగు విసిరింది రేఖ.

శేషయ్య కూతురి ముఖం లోకి ఆశ్చర్యంగా చూశాడు.

శేషయ్య పెద్దకూతురు రేఖ. ఆ తర్వాత వాళ్ళు నలుగురూ మగ పిల్లలే. అందరూ స్కూల్లో చదువు తున్న వాళ్ళే.

రేఖను కాలేజీలో చేర్పించాడు శేషయ్య.

మగపిల్లలు కాలేజీచదువులకు వచ్చేసరికి రేఖ గ్రాడ్యుయేట్ అయి ఉద్యోగంలో చేరితే, వీళ్ళను చదివించడానికి అట్టే ఇబ్బంది వుండదని శేషయ్య అభిప్రాయం. అందుకే రేఖను కాలేజీలో చేర్పించాడు.

పెద్దకుర్రవాడు చేతికి అందివచ్చాక పిల్లపెళ్ళి చేయాలనుకున్నాడు.

"రమేశ్ అంటే వాళ్ళనాన్నకు ప్రాణం. ఒకే కొడుకు. కొడుకు కావాలనాలేగాని కొండమీది కోతి నైనా తెచ్చి ఇస్తాడు." ఆలోచనలో వున్న తండ్రి ముఖంలోకి చూస్తూ అన్నది రేఖ.

కొంచెం ఆగి "కొడుకు ఆనందంకోసం..." అంటూ తండ్రిముఖంలోకి చూసింది.

శేషయ్య ఆలోచనలో పడ్డాడు.

శేషయ్య ఆ రాత్రంతా ఆలోచించాడు.

తెల్లవారి ఆఫీసుకు వెళ్తూనే మానేజింగ్ డైరెక్టర్ గోపాలరావు గదిలోకి వెళ్ళాడు.

శేషయ్య వళ్ళువంచి పని చేస్తాడు. నమ్మకస్తుడు. గోపాలరావుకు అతనంటే గౌరవం వుంది.

"ఏమిటోయ్ పొద్దున్నే పిలవకుండానే వచ్చావు?" నవ్వుతూ పలకరించాడు గోపాలరావు.

శేషయ్య తటపటాయిస్తూ నిలబడ్డాడు.

"చెప్పు! ఏం కావాలి. కూర్చో!" అన్నాడు గోపాలరావు ఆదరణగా.

శేషయ్య కూర్చోలేదు.

గోపాలరావుకు ఎదురుగా ఏనాడూ కూర్చోలేదు.

"ఏమిటి సందేహిస్తున్నావ్? ఫర్వాలేదు చెప్పు. శెలవుకావాలా?"

"మీ అబ్బాయీ మా అమ్మాయీ ఒకే కాలేజీలో చదువుతున్నారు" నాలుకకు అంటుకుపోతున్న మాటల్ని బలవంతంగా బయటికి తోస్తున్నట్టు అన్నాడు శేషయ్య.

"అయితే?" అడగలేదు. శేషయ్య కళ్ళలోకి గోపాలరావు చూశాడు.

"వాళ్ళిద్దరూ ప్రేమించుకున్నారు. పెళ్ళిచేసుకొంటారట!" గబగబా అనేశాడు శేషయ్య.

గోపాలరావు శేషయ్య ముఖంలోకి విస్మయంగా చూశాడు.

శేషయ్యకు భయం భయంగా వుంది. అరిచేతుల్లో చెమట, కాళ్ళలో కొద్దిగా వణుకు.

"మీ అబ్బాయే ఈ విషయం మీతో చెప్పమని మా అమ్మాయిద్వారా కబురు పంపించాడు...అందుకే —" తన తప్పేంలేదని సంజాయిషీ ఇచ్చుకొంటున్నట్టు అన్నాడు శేషయ్య వణుకుతున్న కంఠంతో.

గోపాలరావు ముఖం గంభీరంగా మారింది.

"క్షమించండి నేను తప్పుగా మాట్లాడితే..."

గోపాలరావు శేషయ్య ముఖంలోకి అదోలా చూశాడు.

"నాకు అభ్యంతరం లేదు." అన్నాడు గోపాలరావు.

శేషయ్య కళ్ళు మెరిశాయి.

అంతలోనే అనుమానం వచ్చింది.

గోపాలరావు నిజంగా ఆ మాట అన్నడా? తనకు అలా పొరపాటుగా వినిపించిందా?

"కాని ఒక షరతు!"

శేషయ్య తలెత్తి చూశాడు.

"నువ్వు ఈ ఉద్యోగం మానెయ్యాలి."

శేషయ్య తృళ్ళిపడి గోపాలరావు ముఖంలోకి చూశాడు.

గోపాలరావు ముఖంలో శేషయ్య ఆశించినట్టు కోపం కన్పించలేదు.

పెదవుల మీద చిరునవ్వు తొణికిస లాడుతూవుంది.

"ఇష్టమేనా!"

"సరే!" బొంగురు పోయిన కంఠతో అన్నాడు శేషయ్య

"నా దగ్గిర పని చేసే గుమాస్తా కూతుర్ని కోడలుగా తెచ్చుకుంటే ఈ ఆఫీసులో నాకేంగౌరవం వుంటుంది చెప్పు నువ్వే ఆలోచించు!"

"నిజమే" శేషయ్య మనసులోనే అనుకున్నాడు.

"ఇప్పుడే రాజీనామా రాసి ఇచ్చెయ్. వెంటనే యాక్సెప్టు చేస్తాను. ఆ తర్వాత ముహూర్తాలు పెట్టించుకోవచ్చు."

శేషయ్య కళ్ళముందు, గోపాలరావూ, ఆ గదిలోని ప్రతివస్తువూ గిర్రున తిరిగినట్టు అయింది.

"ఏమిటయ్యా మాట్లాడవు?" ఈ సారి గోపాలరావు కంఠం కొంచెం తీవ్రంగావుంది.

"క్షమించండిసార్! నేను చాలా తెలివితక్కువగా మాట్లాడాను."

శేషయ్య గిర్రున తిరిగి బయటికి వస్తూవుంటే గోపాల

రావు జాలిగా చూస్తూ" పాపం. అమాయకుడు! అనుకున్నాడు.

దాంతో సరికొత్తగా ప్రారంభం అయిన పాతప్రేమ కథ, ముందుకు నడవనని మొరాయించి నేలమీద చతికిలపడింది.

* * *

రమేశ్ కాలేజీలో రేఖను తప్పించుకొని తిరుగుతున్నాడు.

రేఖ కాలేజీ మానేసింది.

రేఖకు రమేశ్ మీద చాలా కోపంవచ్చింది.

ప్రేమ ద్వేషంగా మారింది.

కసి పెరిగింది.

రమేశ్‌ను తుమ్మచెట్టుకు కట్టించి చింత బరికెతో బాదాలని పించింది.

ఆ చంపా ఈ చంపా వాయించాలనిపించింది.

రేఖ ఒక గవర్నమెంటు ఆఫీసులో యల్. డి. సీ. గా చేరింది.

రమేశ్‌ను మర్చిపోకుండా వుంది. నిరంతరం ఏదో అశాంతి తరుముతూనేవుంది.

రమేశ్‌ను కలుసుకొని కసితీరా తిట్టాలి, ఆ చంపా ఈ చంపా వాయించాలి. అప్పుడుగాని తన మనసు శాంతించదు.

రేఖ ఊహల్లోనే రమేశ్‌ను ఎన్నోసార్లు చెప్పుతో కొట్టింది.

అయినా కసి తీరలేదు.

నాలుగేళ్ళు గడిచాయి.

రేఖ జీవితంలో మార్పు లేదు.

ఆ ఆఫీసులో వాళ్ళకు ఆమె అట్టలు చిరిగిన వార పత్రికలా కన్పిస్తూవుంది.

ఆమె నడక మంచి కథకు చెత్తగా కాపీకొట్టిన కథ నడకలా వుంటుంది.

ఆమెకళ్ళలో ఇప్పుడు కలలు లేవు.

కసి వుంది.

ఆమె పెదవుల్లో ద్వేషం కన్పిస్తుంది.

ఆమెమనసులోని మధువు ఇంకిపోయింది.

ఆమెను చూస్తూంటే లోకంమీద అలిగిన మనిషిలా కన్పిస్తుంది.

ఆమె హృదయంలో ఒకే ఒక కోర్కె. తీరే రోజు కోసమే ఎదురు చూస్తూవుంది.

రమేశ్ ఎప్పటికైనా కనిపించాలి. దగ్గరగా కన్పించాలి, కసికొద్దీ ఆ చంపా ఈ చంపా వాయించాలి. ఇదే ఆమె కోరిక.

ఆ రోజు రానే వచ్చింది.

ఆమె ఎదురుచూసిన రోజు అనుకోకుండా ఎదురైంది.

ఆ రోజు కొత్తఆఫీసరు వచ్చాడు.

కొత్త ఆఫీసర్ని చూసి రేఖ తెల్లబోయింది.

రమేశ్ రేఖను గుర్తించనట్టే నటించాడు.

రేఖ ఆ రాత్రంతా నిద్రపోలేదు. ఆలోచిస్తూనే వుంది.

తెల్లవారి ఆఫీసుకు వెళ్తూనే ఆఫీసరు గదిలోకి వెళ్లాలి. చెప్పుతో ఆ చంపా ఈ చంపా వాయించి వాడిముఖం మీద ఊసి వచ్చేయ్యాలి. అంతే చెయ్యాలి! అంతే!

ఆఫీసుకు వచ్చింది.

ఎప్పటిలా పనిచేసి ఇంటికి తిరిగివచ్చింది.

రేఖ ఆఫీసుకు బయలుదేరుతూ రోజూ "ఏమైనా సరే ఇవ్వాళ వాడి చెంపలు వాయించాలి. భయం ఎందుకు! ఎంత ఎరగనట్టు నటిస్తున్నాడో! రోగ్!" అనుకుంటూనేవుంది.

రెండేళ్ళ క్రితమే రేఖ తండ్రి గుండెజబ్బుతో మరణించాడు. రేఖే కుటుంబాన్ని పోషిస్తూవుంది.

తీరా ఆఫీసుకు వచ్చాక బాధ్యతల్ని గుర్తు చేసుకొని అతి శ్రద్ధగా పనిచేసి బయటపడుతుంది.

రోజూ రేఖకు రమేశ్ కన్పిస్తూనే వున్నాడు.

అతను ఒక్కరోజూ ఆమెను గుర్తించినట్టు కన్పించలేదు.

ఆమె మనసులోని కోర్కె మనసులోనే వుండిపోయింది.

రెండేళ్ళు గడిచిపోయాయి.

రమేశ్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది.

వెళ్తూ వెళ్తూ రేఖకు ప్రమోషన్ ఆర్డర్సు వేసి వెళ్ళాడు.

ఎస్టాబ్లిష్ మెంట్ సూపర్నెంటు ఆర్డర్సు అందించాడు.

ఆర్డరు చూసి రేఖ కసిగా పళ్ళు కొరుక్కుంది.

ముక్కలు ముక్కలుగా చింపి చిత్తుకాగితాల బుట్టలో పారెయ్యాలనుకుంది.

తనకు ఈ ప్రమోషన్ అక్కర్లేదని రాసివ్వాలనుకుంది.

ఆర్డర్సు భద్రంగా పర్సులో పెట్టుకుంది.

కొత్త సీట్లోకి వెళ్ళి కూర్చుంది.

ఆఫీసులో అందరికీ కాఫీలు తెప్పించి ఇచ్చింది.

చిరునవ్వుతో అందరి అభినందనల్నీ స్వీకరించింది.

ఇంటికి వచ్చింది, తల్లి ఏదో అడుగుతున్నా వినిపించుకోకుండా గదిలోకి వెళ్ళి ఛళ్ళున తలుపు మూసింది.

మంచం మీద బోర్లాపడి భోరున ఏడ్చింది.

* * *

ఈ కథ సుఖాంతమో దుఃఖాంతమో, మీరు చెప్పాలి.

అసలు ఇది ప్రేమకథో కాదో కూడా మీరే చెప్పాలి.

★